

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 325 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 08-06-2025 | పేజీలు : 4


# అది వేశ్యల రాజధాని

- అమరావతిపై మరోసారి జగన్ బ్యాచ్ విషం
- సాక్షి డిబేట్‌లో మహిళలకు ఘోర అవమానం
- భగ్గుమన్న అమరావతి ప్రాంత మహిళలు
- రోత మీడియాలో వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం
- జర్నలిస్టులు కేఎస్ఆర్, కృష్ణంరాజుతో పాటు
- భారతిరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- ఆ చానల్ మూయించే వరకూ ఉద్యమిస్తామని వెల్లడి
- 24 గంటల్లో అరెస్టు చేయాలంటూ తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- మహిళల నిరసనకు రైతుల మద్దతు
- రాజధానిలో దిష్టి బొమ్మల దహనం

**అమరావతి, జూన్ 7 (జనస్వరం) :** రాజధాని అమరావతిపై జగన్ అండ్ బ్యాచ్ మరోసారి విషం చిమ్మింది. ఇక్కడి మహిళలను తీవ్రంగా కించపరచడమే లక్ష్యంగా బరితెగించింది. అమరావతి వేశ్యల రాజధాని అంటూ రోత చానల్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న వ్యక్తులు శనివారం ఉదయం లైవ్ డిబేట్‌లో నోరుపారేసుకున్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు (కేఎస్ఆర్) నిర్వహించిన డిబేట్‌లో పాల్గొన్న జర్నలిస్టు, విశ్లేషకుడు కృష్ణంరాజు మాట్లాడుతూ.. "చంద్రబాబు అమరావతి దేవతల రాజధాని అంటున్నారు, కానీ ఇది సెక్స్ వర్కర్లకు నిలయం. ఇక్కడే ఎక్కువ మంది వేశ్యలు ఉన్నారు. వారికోసం ఎన్నో స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి" అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై రాజధాని మహిళలు భగ్గుమన్నారు. రాజధాని అమరావతి మహిళలను కించపరిచిన వారు వెంటనే క్షమాపణలు చెప్పాలని అల్టిమేటమ్ జారీ చేశారు. కృష్ణంరాజుకు మహిళల చేతిలో చెప్పుదెబ్బలు తప్పవన్నారు. డిబేట్ నిర్వహించిన కొమ్మినేని కూడా క్షమాపణ చెప్పాల్సిందేనన్నారు. సాటి మహిళలను అగౌరవపరుస్తుంటే ఖండించకుండా ఉన్నందుకు భారతిరెడ్డి కూడా బాధ్యురాలేనని, ఆమె కూడా మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఐదేళ్లు అమరావతి ఉద్యమం చేసి వైసీపీకి 11 సీట్లు మాత్రమే వచ్చేటట్టు చేసి సత్తా చాటామని, ఇప్పుడు సాక్షి చానల్ మూసే వరకు మరో ఉద్యమం చేపడతామని మహిళలు ప్రకటించారు. ఉద్యమం తమకు కొత్తకాదని, కేసులు కూడా కొత్త కాదన్నారు. రాజధాని ప్రాంత మహిళలను తీవ్రంగా కించపరచడంలో భాగస్వాములైన ఆ ముగ్గురు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేదంటే తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని రైతు జేఏసీ హెచ్చరించింది. ఈ సందర్భంగా మహిళలు కేఎస్ఆర్, కృష్ణంరాజు ఫొటోలను గోడకు అతికించి చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. అనంతరం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు. కేఎసఆర్, జర్నలిస్ట్ కృష్ణంరాజును 24 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని ఐదు కోట్ల ఆంధ్రులదని, పూర్వ కాలం నుంచి ఈ ప్రాంతానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని మహిళలు చెప్పారు. కృష్ణంరాజును, కేఎస్ఆర్‌ను ఉరితీయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి చానల్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా పెదపాడు పోలీస్ స్టేషన్‌లో కూటమి శ్రేణులు ఫిర్యాదు చేశాయి.

**కృష్ణంరాజు ఇంటిని ముట్టడించిన రైతులు :**

అసభ్యకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టు వాడపల్లి కృష్ణంరాజు ఇంటిని అమరావతి రైతులు శనివారం ముట్టడించారు. విజయవాడ అయోధ్యనగర్‌లోని ఆయన ఇంటికి రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమరావతి మహిళలకు కృష్ణంరాజు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు వస్తున్నారన్న సమాచారంతో కృష్ణంరాజు ఇంటి నుంచి పారిపోయారు. ఆయన ఇంటి ముందు రైతులు కొద్దిసేపు నినాదాలు చేసి వెనుదిరిగారు.

**కృష్ణంరాజు, కేఎస్ఆర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి: బాలకోటయ్య**



రాజధాని అమరావతిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన కేఎసఆర్, కృష్ణంరాజులను వెంటనే అరెస్ట్ చేయాలని అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య డిమాండ్ చేశారు. ప్రజా రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అని వ్యాఖ్యానించడం క్షమించరాని నేరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 24 గంటల్లో వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని బాలకోటయ్య డిమాండ్ చేశారు.

**ఆ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం:సాక్షి యాజమాన్యం**

సాక్షి టీవీ వేదికగా జర్నలిస్టులు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అంతా ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. సాక్షిపై సోషల్ మీడియాలో కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జరిగిన తప్పునకు క్షమాపణలు కోరాల్సిన సాక్షి యాజమాన్యం, వైసీపీ రాష్ట్ర నాయకత్వం తప్పించుకునే ప్రయత్నం చేసింది. కృష్ణంరాజు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని.. ఇందులో సాక్షి యాజమాన్యానికిగానీ, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డికి గానీ సంబంధం లేదంటూ శనివారం ప్రకటించి చేతులు దులుపుకొన్నాయి.

**రాజధానిలో ఆగ్రహజ్వాలలు :**

తుళ్లూరులో శనివారం సాయంత్రం రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు లైబ్రరీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. కేఎసఆర్, కృష్ణంరాజు దిష్టిబొమ్మలను దహనం చేశారు. సాక్షి పత్రికను అబద్ధాల వైసీపీ కరపత్రిక అంటూ రోడ్డుమీద తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. సాక్షి పత్రిక, చానెల్ నడుపుతున్న భారతీరెడ్డి క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. గవర్నర్‌ను, జాతీయ మహిళా కమిషన్‌ను కలసి ఫిర్యాదు చేస్తామని రైతు జేఏసీ తెలిపింది. జర్నలిస్ట్ ముసుగులో జగన్‌రెడ్డి చెంచాగా వ్యవహరించే కృష్ణంరాజును వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఇక మహిళలకు రక్షణగా సెంటర్‌లో రైతులు మానవహారంగా ఏర్పడ్డారు. కృష్ణంరాజు, కేఎసఆర్ చిత్రపటాలను చెప్పులతో కొట్టి, కాళ్ల కింద వేసి తొక్కారు. అటుగా వెళ్తున్న బస్సులు, వాహనాల్లో ఉన్న ప్రయాణికులు కూడా దిగివచ్చి మహిళలకు సంఘీభావం తెలిపారు.

# మహిళలను అవమానిస్తే కాలగర్భంలో కలిసిపోతారు

- జగన్ గ్యాంగ్‌ని ఎట్టిపరిస్థితుల్లో క్షమించం: మంత్రి లోకేశ్
- వైసీపీ అధ్యక్షుడు జగన్ ఇల్లు ఎక్కడుంది?: గొట్టిపాటి
- ఆడబిడ్డలను అవమానించిన వారిని ఉపేక్షించొద్దు: అనగాని
- క్షమాపణ చెప్పకుంటే మహిళా లోకం తిరగబడుతుంది: కొలుసు

**అమరావతి, నూజివీడు, జూన్ 7 (జనస్వరం) :** రాజధాని ప్రాంత మహిళలను కించపరుస్తూ జగన్ చానల్‌లో పాత్రికేయుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై ద్వేషంతో మహిళలను అవమానించడం వైసీపీ దిగజారుడుతనానికి పరాకాష్ఠ అని మంత్రి లోకేశ్ మండిపడ్డారు. 'మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయం. ఆకాశంపై ఉమ్మేయాలనుకుంటే అది మీ మీదే పడుతుంది. అమరావతిపై విషం చిమ్మాలనుకుంటే అది మీ తాడేపల్లి ప్యాలెసలోనే పడుతుంది. అమరావతి ముమ్మాటికీ దేవతల రాజధానే. భూములు త్యాగాలు చేసిన అమ్మల అమరావతి. మూడు రాజధానుల కపట కుట్ర పొత్తిళ్లలో తంతుంటే.. జై అమరావతి అని నినదించిన శాంతమూర్తుల పవిత్ర భూమి మన రాజధాని. కన్న తల్లిని, సొంత చెల్లిని తరిమేసిన దుర్మార్గుడికి మహిళల త్యాగాలు, గొప్పతనం ఏం తెలుస్తుంది? అమరావతిపై విషం చిమ్మేందుకు జన్మనిచ్చిన అమ్మలను, జన్మంతా మనతో నడిచిన మహిళాలోకాన్ని కించపరిచిన జగన్ గ్యాంగ్‌ని ఎట్టి పరిస్థితుల్లో క్షమించం.










జగన్‌రెడ్డి బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలి. లేకుంటే దేవతల రాజధాని అమరావతి... దెయ్యం జగన్ పని పడుతుంది' అని లోకేశ్ హెచ్చరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'రాజధాని మహిళల్ని కించపరచేలా వైసీపీ పేటీఎం బ్యాచ్ మాట్లాడుతోంది. జగన్ ఇల్లు ఎక్కడుంది? రాజధాని మహిళలను కించపరచేలా మాట్లాడుతున్న వైసీపీ నేతలు తినేది అన్నమేనా లేదా ఇంకేదైనానా? పనికిమాలిన బ్యాచ్‌తో ఇంకెంతకాలం అమరావతిపై విషప్రచారం సాగిస్తారు? తలాతోకా లేకుండా అర్థం లేని వ్యాఖ్యలతో మహిళల్ని కించపరచే మీరు మనుషులేనా?' అని గొట్టిపాటి మండిపడ్డారు. మంత్రి కొలుసు పార్థసారథి ఓ ప్రకటన చేస్తూ... 'రాజధాని అమరావతి ప్రాంత మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యానించడం సిగ్గు చేటు. సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. వారి మాటలు వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సాక్షి పత్రికపై, కృష్ణంరాజుపై తిరుగుబాటు తప్పదు. కృష్ణంరాజును మహిళలు తరిమి, తరిమి కొడతారు' అని హెచ్చరించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, 'రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా మాట్లాడటం నీచాతినీచం. ఆడబిడ్డలను అవమానించిన వారిని ఉపేక్షించకూడదు' అని అన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పందిస్తూ... ఆడబిడ్డలందరినీ ఘోరంగా అవమానించేలా వ్యాఖ్యలు చేయించడం వైసీపీ చెత్త రాజకీయాలకు నిదర్శనం' అని విమర్శించారు.

**కొమ్మినేని, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోండి డీజీపీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ లేఖ :**

రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అంటూ వ్యాఖ్యానించిన జర్నలిస్టు కృష్ణంరాజు, ఆ కార్యక్రమ నిర్వాహకుడు కొమ్మినేని శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఈమేరకు ఆయన శనివారం డీజీపీకి లేఖ రాశారు. మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసినందుకు కొమ్మినేని, కృష్ణంరాజుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ కార్యక్రమాన్ని టెలికాస్ట్ చేసిన జగన్ మీడియాపైనా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా మహిళల గౌరవాన్ని, అమరావతి ప్రతిష్ఠను కాపాడాలని లేఖలో డిప్యూటీ స్పీకర్ కోరారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 08 జూన్ 2025,

తిథి : శుద్ధ ద్వాదశి (ఉ.07:22 వ.కు),

నక్షత్రం : స్వాతి (మ.12:43వ.కు),

బ్రహ్మ ముహూర్తం : తె.04:01 ల తె.04:49,

రాహుకాలం : సా.04:58 ల సా.06:36,

యమగండం : మ.12:07 ల మ.01:44,

వర్జ్యకాలం : రా.07:01 రా.09:01

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 08 జూన్ 2025,

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:30

సూర్యోదయం : ఉదయం గం. 05:49

జొహర్ : మధ్యాహ్నం గం. 12:19

అసర్ : సాయంత్రం గం. 03:44

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:48

ఇష : రాత్రి గం. 08:08





జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# అమరావతి అవమానానికి స్పందన కావాలి

### 'వేశ్యల రాజధాని' అనడం సాక్షి అపచారం

ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని అమరావతిపై గత ఐదేళ్లుగా ఎన్నో రాజకీయ విమర్శలు వచ్చాయి. అయితే, తాజాగా సాక్షి ఛానెల్ ప్రసారం చేసిన ఓ చర్చా కార్యక్రమంలో, న్యూస్ యాంకర్ అమరావతిని "వేశ్యల రాజధాని"గా వర్ణించిన తీరును ఇప్పటివరకు వెలువడిన అత్యంత నీచమైన, సంస్కృతి విరుద్ధమైన వ్యాఖ్యగా నిర్ద్వంద్వంగా ఖండించాల్సిన అవసరం ఉంది.

ఇది రాజధానిని కోరుకున్న రైతుల త్యాగాలపై అవమానం. ఇక్కడ నివసించే ప్రతి ఒక్క మహిళపై దుర్మార్గమైన మచ్చ. అంతేకాదు, ఇది తెలుగు సంస్కృతిపై చేసిన అసభ్యమైన దాడి. రాజకీయ విమర్శలు ఒక ఎత్తు అయితే, పరువు నాశనం చేయడం మరో ఎత్తు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ నుంచి వలస వచ్చి అమరావతి కోసం త్యాగం చేసిన 29 గ్రామాల ప్రజల ఆత్మగౌరవాన్ని తుంచేయడమే కాకుండా, ఆంధ్రుల పరువును కించపరిచే చర్యగా భావించాలి.

**వ్యాఖ్య వెనుక దురుద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తోంది :**
రాజధాని కోసం జీవితాలను అర్పించిన ప్రజల గుండెలపై నెట్టిన ఈ మాట – మానసిక దాడి లాంటిది. 2014 ఎన్నికల సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా అమరావతిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చాక అమరావతిని నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు మాత్రం ఇంకొంచెం ముందుకెళ్లి, అదే పార్టీకి అనుబంధంగా నడిచే మీడియా వేదికలో, అమరావతిని 'వేశ్యల కూపం'లా చూపించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**అమరావతి అంటే ఆశల నగరం :**
అమరావతి అనేది ఒక ప్రణాళికాబద్ధమైన నగరం. రైతుల త్యాగం, ప్రజల కలలు, అభివృద్ధి పట్ల ప్రజల నమ్మకం – ఇవన్నీ ఇందులో ప్రతిఫలిస్తాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలందుకున్న మాస్టర్ ప్లాన్ ఈ ప్రాంతానికి ఉన్నది. ఇలాంటి ప్రదేశాన్ని విమర్శించాలంటే – వాస్తవాల ఆధారంగా మాట్లాడాలి. కానీ స్థానికుల గౌరవాన్ని కించపరిచేలా, మహిళల్ని అపమానించేలా మాట్లాడడం అప్రజాస్వామిక చర్య.



**డిప్యూటీ స్పీకర్ రాఘురామ లేఖ..బాధ్యతాయుతమైన స్పందన :**
ఈ వ్యాఖ్యలపై స్పందించిన వారిలో ముందుగా నిలిచినవారు రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రాఘురామకృష్ణంరాజు. ఆయన డీజీపీకి లేఖ రాస్తూ, సాక్షి ఛానెల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. అంతేకాక, బాధ్యతారాహిత్యపు ప్రసారానికి రూ.50 కోట్ల నష్టం పరిహారం డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసు కూడా జారీ చేశారు.

"ఈ వ్యాఖ్యలు కేవలం అమరావతి ప్రజలకే కాకుండా, రాష్ట్రంలోని ప్రతి మహిళను అవమానించేలా ఉన్నాయి. ఇటువంటి వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవడమే ప్రజాస్వామ్య బాధ్యత," అని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా ఆయన వ్యవహరించిన తీరు ఇతరులకు ఆదర్శం కావాలి.

**సాక్షి మాఫీ చెబుతుందా? :**
ఇలాంటి వ్యాఖ్యలు ఏ మీడియా సంస్థ నుంచైనా రావడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. మీడియా స్వేచ్ఛ పేరుతో మహిళల గౌరవాన్ని పాడు చేసే మాటలు ప్రసారం చేయడం మన్నించదగినది కాదు. ఇప్పటికైనా సాక్షి ఛానెల్ తమ తప్పును గ్రహించి, రాష్ట్ర ప్రజలకు బహిరంగంగా క్షమాపణ

## ఎడిటోరియల్

చెప్పాలి. లేకపోతే ఇది కేవలం భాషాపరమైన పొరపాటు కాదని, పూర్వాభిప్రాయంతో చేసిన దుష్ప్రచారంగా పరిగణించాలి.

**ప్రజల స్పందన.. 'అమరావతిని తక్కువ చేయలేరు' :**
సాక్షి వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన వ్యతిరేకత వ్యక్తమైంది. రైతులు, మహిళలు, యువత భారీగా స్పందించారు. "మేము భూములు ఇచ్చాం, మమ్మల్ని ఇలా కించపరిచే హక్కు ఎవరికి ఉంది?" అని ఆవేదన వ్యక్తమైంది.

ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వేదికలపై #IStandWith Amaravati, #AmaravatiSelfRespect, #BanSakshiChannel వంటి హ్యాష్‌ట్యాగ్లు విస్తృతంగా ట్రెండ్ అయ్యాయి. రైతు కుటుంబాలు, మహిళా సంఘాలు, పౌరసంఘాలు తీవ్రంగా స్పందించాయి. "మీడియా స్వేచ్ఛ హద్దుల లోపలే ఉండాలి. మహిళల పరువు తాకట్టు కాదని" ప్రజలు స్పష్టంగా చెప్పారు.

రాజధాని ప్రాంత యువత – ప్రగతిశీల పౌర సమాజం ప్రతినిధిగా – చైతన్యంతో స్పందించింది. "ప్రాంత విమర్శ వేరే, లైంగిక సంకేతాలతో దూషణ వేరే" అనే స్పష్టతను ప్రజలు తేటతెల్లంగా ప్రకటించారు.

**"అమరావతిని మేము త్యాగంతో నిర్మించాం. ఎవరూ దానికి మచ్చ వేయలేరు."**



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## మృగశిర కార్తె - మృగశిరం వృతశిరం

- జూన్ 08 ఆదివారం నుంచి మృగశిర కార్తె ప్రారంభం
- సూర్యుడు ఒక్కొక్క నక్షత్రం సమీపంలో 14 రోజుల పాటు ఉంటాడు.
- సూర్యుడు ఏ నక్షత్రానికి సమీపంలో ఉంటే ఆ కాలానికి ఆ నక్షత్రం పేరు పెట్టారు

సూర్యుడు ఒక్కొక్క నక్షత్రం సమీపంలో 14 రోజుల పాటు ఉంటాడు. సూర్యుడు ఏ నక్షత్రానికి సమీపంలో ఉంటే ఆ కాలానికి ఆ నక్షత్రం పేరు పెట్టారు.ఆ కాలాన్నే కార్తె అంటారు. ఈ కార్తెలు సౌరమానం ప్రకారం లెక్కించడం వలన గ్రెగేరియన్ క్యాలెండరు ప్రకారం కార్తెలు ఏటా ఒకే తేదీల్లో వస్తాయి. అశ్వినితో ప్రారంభమై రేవతితో ముగిసే కార్తెలు ఇరవై ఏడు నక్షత్రాల పేర్లతో ఉన్నాయి. అవి 1 అశ్వని, 2 భరణి, 3 కృత్తిక, 4 రోహిణి 5 మృగశిర 6 ఆరుద్ర 7 పునర్వసు 8 పుష్యమి 9 ఆశ్లేష 10 మఖ 11 పుబ్బ 12 ఉత్తర 13 హస్త 14 చిత్త 15 స్వాతి 16 విశాఖ 17 అనూరాధ 18 జ్యేష్ఠ 19 మూల 20 పూర్వాషాఢ 21 ఉత్తరాషాఢ 22 శ్రవణం 23 ధనిష్ట 24 శతభిషం 25 పుర్వాబాధ్ర 26 ఉత్తరాబాధ్ర 27 రేవతి. జూన్ 8న సూర్యుడు మృగశిర నక్షత్రానికి సమీపంలో ఉండడం వలన ఆ రోజునుండి మృగశిర కార్తె ప్రారంభం అవుతుంది. ఇప్పటి వరకు ఎండల వల్ల అల్లాడిపోయిన సమస్త జీవరాశికి మృగశిర కార్తెతో ఊరట కలుగుతుంది. మృగశిర కార్తెను వర్షారంభానికి సూచనగా భావిస్తారు. ఈ కార్తెలోనే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అందువలన వాతావరణం చల్లబడుతుంది. ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతుంది. మృగశిర కార్తెను రైతులు ఏరువాక సాగే కాలం అని కూడా అంటారు. ఈ కాలంలో తొలకరి జల్లులు కురవగానే పొలాలు దున్నడం ప్రారంభిస్తారు. మృగశిర కార్తెను చాలా ప్రాంతాల్లో పండుగలా జరుపుకుంటారు. మృగశిరను మృగం, మిరుగు, మిర్గం అనే పేర్లతో పిలుచుకుంటారు. ఈ రోజున ఇంగువ కలిపిన బెల్లం తింటారు. ఇంగువ శరీర ఉష్ణోగ్రతను పెంచి వర్షకాలంలో వచ్చే ఇతర వ్యాధులను నియంత్రిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. మృగశిర నక్షత్ర కూటాన్ని కొందరు మృగం శిరస్సు అని, మృగం అని, మృగ రూపం ధరించిన ప్రజాపతి అని, యజ్ఞోపవీతాన్ని ధరించిన పురుషుడని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మృగశిర నక్షత్రానికి అధిదేవత చంద్రుడు.వేదం మృగశిర వృతశిరం అని అభిప్రాయపడింది. పురాణగాధ ప్రకారం మృగశిరస్సు కలిగిన మృగవ్యాధుడు అనే వృతాసురుడు వరప్రభావం వలన పశువులను, పంటలను నాశనం చేయడం, ప్రకృతి భీభత్సాలు సృష్టించడం. వర్గాలకు అడుపడటం లాంటివి చేస్తుండేవాడు. అతడు మరణం లేకుండా వరం పొందడంచేత ఇంద్రుడు సముద్ర అలల నుండి వచ్చే నురుగును ఆయుధంగా చేసి చంపేస్తాడు. ఆ విధంగా ఇంద్రుడు వృత్రుని సంహరించి లోకానికి వర్ష దానం చేశాడు. అందుకే ఇంద్రుని వరప్రదాత, వరదేవుడు అని పిలుచుకుంటారు. తూర్పున జ్యేష్ఠ ఉదయించగానే పడమర మృగశిర అస్తమిస్తుంది. అంటే అప్పుడు సూర్యుడు మృగశిరతో కూడి ఉంటాడు. అదే మృగశిర కార్తె ప్రవేశం. మృగశిర ప్రవేశంతో వర్షాలు ఆరంభమై గ్రీష్మతాపం తగ్గి వాతావరణం చల్లబడుతుంది.



శ్రీనివాస్ కోపిల్ల,
సీనియర్ రిపోర్టర్,
హైదరాబాద్.

# రాయచోటిలో టీడీపీకి బిగ్ షాక్

- సైకిల్ దిగిన సుగవాసి
- అభిమానుల సూచనల మేరకే పార్టీని వీడుతున్నట్లు ప్రకటన
- చంద్రబాబుకు రాజీనామా పత్రాన్ని పంపినట్లు వెల్లడి

**పులివెందుల జూన్ 7 (జనస్వరం) :** అన్నమయ్య జిల్లా రాయచోటిలో టీడీపీకి బిగ్ షాక్ తగిలింది, పార్టీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం సైకిల్ దిగారు. అభిమానుల, కార్యకర్తల సూచనల మేరకే రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ మేరకు రాజీనామా పత్రాన్ని సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. 2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకొండ్రాయుడు కుటుంబానికి జరుగుతున్న అవమానాలపై చంద్రబాబు దృష్టి సారించలేదని టీడీపీ వర్గీయులు చెబుతున్నారు. రాయచోటి పర్యటనలో సైతం ప్రాధాన్యత ఇవ్వలేదని తెలుస్తోంది. తరచుగా అవమానాలు జరుగుతున్నా పార్టీలో కొనసాగుతూ వచ్చిన పాలకొండ్రాయుడు కుటుంబం కట్టె కాలే వరకూ పార్టీలోనే కొనసాగుతానని బాలసుబ్రమణ్యం తండ్రి పాలకొండ్రాయుడు శపథం చేశారు. ఆరోగ్యం సహకరించకపోయిన గడిచిన ఎన్నికల్లో రాంప్రసాద్ రెడ్డి గెలుపు కోసం వీల్ చైర్‌లో వెళ్లి ప్రచారం చేశారు. సుబ్రమణ్యంకు రాజంపేట టీడీపీ ఎంపీ టికెట్ అంటూ ప్రచారం జరిగింది. కానీ ఎంపీ టికెట్ ఇవ్వకుండా పొరుగు నియోజకవర్గంలో చంద్రబాబు టికెట్ ఇచ్చారు. స్వస్థలం రాయచోటి కాకుండా రాజంపేటకు టికెట్ ఇచ్చినా చంద్రబాబు ఆదేశాల మేరకు సుబ్రమణ్యం పోటీ చేశారు. స్వపక్ష పార్టీ నేతల వెన్నుపోటుతో సుబ్రహ్మణ్యం ఓటమిపాలైనట్లు ప్రచారం నడిచింది. ఇక ఇంచార్జి వ్యవహారంలోనూ మొండి చెయ్యి చూపారని ఆ పార్టీ శ్రేణుల్లో ప్రచారం



సాగుతోంది. ప్రాధాన్యత ఇవ్వని పార్టీలో కొనసాగడం ఎందుకని కొంతకాలంగా అభిమానులు రాజకీయంగా బిడ్డలను ఒక స్థాయిలో చూడాలని పాలకొండ్రాయుడు ఆశించారు. పార్టీలో బిడ్డలకు జరుగుతున్న అవమానాలను చూసి తట్టుకోలేక పోయిన పాలకొండ రాయుడు ఆరోగ్యం మానసిక వేదనతో క్షీణించింది. అనంతరం చికిత్స పొందుతూ పాలకొండ రాయుడు మృతి చెందాడు. పాలకొండ్రాయుడు మృతి చెందినా చంద్రబాబు పరామర్శించలేదు. చంద్రబాబుతో సమకాలీన రాజకీయాలు చేసినా పరామర్శకు రాకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి నెలకొంది. ఇన్ని అవమానాలు జరుగుతున్నా పార్టీలో కొనసాగడం ఏమిటని సుగవాసి కుటుంబాన్ని అభిమానులు ప్రశ్నించారు. పార్టీ వీడాలని ఒత్తిడి తీసుకురావడంతో ప్రజలు అభిమానులతో సమాలోచన చేసిన తరువాత సుబ్రహ్మణ్యం ఒక నిర్ణయానికి వచ్చారు. రాయచోటిలో బలమైన వర్గం ఉన్న సుగవాసి కుటుంబాన్ని దూరం పెట్టడాన్ని సుగవాసి అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. పార్టీ అధికారంలో ఉన్నా మంత్రి మండిపల్లి వర్గీయులు ఇబ్బంది పెడుతూ వచ్చారు. ఆ మేరకు సుబ్రహ్మణ్యం ప్రజలు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సూచనలు సలహా మేరకు తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే తన రాజీనామా పత్రాలను సీఎం చంద్రబాబుకు పంపినట్లు ఆయన వెల్లడించారు. మరి సుబ్రహ్మణ్యం రాజీనామా పత్రాలను అధిష్టానం ఆమోదిస్తుందా లేదా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

## మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతిపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంతాపం

**కోవూరు, జూన్ 7 (జనస్వరం) :** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మరణ వార్త విషాదకరమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆయన తుదిశ్వాస విడిచినట్టు ఆమె తెలిపారు. విశాఖపట్నం-2 నియోజకవర్గ ఎమ్మెల్యేగా సింహాచలం అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో పల్లా శ్రీనివాస్ సహా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గోవింద నామాలతో మార్మోగుతున్న తిరువీధులు



**తిరుపతి, జూన్ 7 (జనస్వరం) :** ప్రతి శనివారం ఉదయం తిరుపతి పురవీధులు గోవింద నామాలతో మార్మోగుతున్నాయి.. శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి క్షేత్రంలో అడుగడుగునా భక్తి భావం పెంపొందించాలన్న సంకల్పంతో స్థానిక భజన మండలి కళాకారులు శ్రీవారికి ఎంతో ఇష్టమైన శనివారం రోజున నగర సంకీర్తన చేస్తున్నారు. వందమందికి పైగా భజన మండలి కళాకారులు ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు సాంప్రదాయ వస్త్రాలతో నుదుటిపైన గోవింద నామాలతో స్థానిక గోవిందరాజస్వామి ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. అక్కడి నుంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరు వీధులలో నగర సంకీర్తన చేస్తు నగరంలో ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, వాసుదేవరెడ్డి, మునినాథ రెడ్డి, నాగేశ్వరరావు, కొండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, పొన్నాల జేజిరెడ్డి, విద్వాన్ కస్పా పద్మనాభం, మధు, మేకల గంగయ్య, మురళి, విగ్రహాల కళ్యాణి, కళావతి, పార్వతి, జయమ్మ, సుభద్రమ్మ, అరుణ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## కేసుల్లో అరెస్ట్ తప్పదనే జగన్ నాటకాలు

### రాష్ట్ర ప్రజలకు జగన్, "సాక్షి" భారతి క్షమాపణలు చెప్పాలి

**తిరుపతి, జూన్ 7 (జనస్వరం) :** ఇప్పటికే పీకల్లోతు అక్రమ ఆస్తుల కేసులు, ప్రజాధనం దుర్వినియోగం కేసుల్లో కూరుకుపోయిన జగన్మోహన్ రెడ్డి తన అరెస్ట్ తప్పదని గ్రహించే రోజుకొక నాటకం ఆడి ప్రజల్లో చులకన అవుతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్ విమర్శించారు. ప్రజా రాజధాని అమరావతికి స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన మహిళా రైతులను సాక్షి ఛానెల్ డిబేట్‌లో చులకన చేసి, పరుష మాటలతో పైసాచిక ఆనందం పొందిన జగన్ రెడ్డి, సాక్షి మీడియా యాజమాన్యంగా భారతి వెంటనే రాష్ట్ర ప్రజలకు, మహిళా రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా ఉందికదా అని ఇస్తానుసారం మాట్లాడి, మహిళల శీలహననం చేయించినందుకు తగిన శాస్తి అనుభవించి తీరాలని పేర్కొన్నారు. అమరావతిలో అధికంగా ఉన్న బీసీ, ఎస్సీలను అవమానించి నందుకు, ప్రముఖ బౌద్ధ క్షేత్రంపై దాడి చేయించినందుకు, కుంభకోణాల నుంచి ప్రజాదృష్టి మళ్ళించేందుకే దిగజారుడు రాజకీయాలు చేస్తున్న జగన్ త్వరలో శ్రీ కృష్ణ జన్మస్థలం చేరడం తప్పదని హెచ్చరించారు. ఆచార్య నాగార్జునుడు ప్రపంచస్థాయి విశ్వ విద్యాలయం నిర్వహించిన ప్రాంతం అమరావతి – ప్రముఖ బౌద్ధ క్షేత్రం అమరావతి – శాతవాహనుల రాజధాని అమరావతి అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న ప్రాంతం అమరావతి గురించి దుగ్ధతతో డిబేట్ చాటున ఆరాచకం చేయడం సాహించేది కాదన్నారు. ఇంతటి పవిత్రమైన, ప్రముఖమైన అమరావతిపై సాక్షి చానల్లో జగన్ డైరక్షన్ లేకుండా నీచాతినీచమైన దుష్ప్రచారం దాడి చేయడం జరగదని.. దీనికి తక్షణమే జగన్ రెడ్డి, ఆయన భార్య భారతి క్షమాపణలు చెప్పాలన్నారు. స్త్రీలన్నా, ఆడ బిడ్డలన్నా జగన్‌కు విలువ లేకపోవచ్చు గానీ.. ఇలా ఆనందం పొందితే రాష్ట్ర మహిళలు వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సాక్షి డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు, కిరాయి బ్యాచ్ మహిళలను కించపరుస్తూ అత్యంత నీచపు వ్యాఖ్యలు చేశారు. ఇది రాష్ట్ర మహిళల వ్యక్తిత్వం మీద దాడి అని వెంకిటీల వ్యాఖ్యానించారు. జగన్ మోహన్ రెడ్డి కుంభకోణాలపై ప్రజాదృష్టి మళ్లించడానికే అమరావతిపై ఈ దుర్మార్గపు, నీచపు దాడి చేయించారని సురేంద్ర కుమార్ మండిపడ్డారు– ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రం మొత్తం ఏకమై సైకోలను, క్రిమినల్ మైండ్ వారిని, వ్యవస్థలను నాశనం చేసేవారిని తరిమి తరిమి కొట్టాలని టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

## మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి తీరని లోటు

### తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్



**విశాఖపట్నం, జూన్ 7 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి విశాఖకు తీరని లోటు, మంచి వ్యక్తి కోల్పోయామని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ అన్నారు. కార్మిక నాయకుడిగా ఆయన సేవలు అందించారని గుర్తు చేశారు. విశాఖ-2 ఎమ్మెల్యేగా ఆయన ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. ఆయన్ను గత నెల 29న ఆసుపత్రిలో నేను పరామర్శించినట్లు తెలిపారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

## 22ఏ నుంచి కూటమి ప్రభుత్వం విముక్తి కల్పిస్తుంది

### తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు



**తిరుపతి, జూన్ 7 (జనస్వరం) :** రాజకీయ కక్షసాధింపులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాలను 22ఏ కింద వైసీపీ నాయకులు చేర్చారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. గత ప్రభుత్వంలో 22ఏ కింద చేర్చిన ప్రాంతాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వీలైనంత త్వరగా విముక్తి కల్పిస్తుందని ఆయన చెప్పారు. శనివారం ఉదయం గంగమ్మగుడి ప్రాంతంలో తాతానగర్ వాసుల కృతజ్ఞతా సమావేశం నిర్వహించారు. సర్వేనంబర్ 4048లో 2 ఎకరాల 49 సెంట్ల భూమిలో గంగమ్మగుడికి చెందిన భూమి కొంత ఉందని గతంలో 22ఏ కింద తాతానగర్ ప్రాంతాన్ని చేర్చారు. అయితే ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే సర్వేనంబర్ 4048ను సబ్ డివిజన్ చేసి గంగమ్మ గుడికి 70 సెంట్లు మిగతా భూమిని తాతానగర్ వాసులకు కేటాయించి 22ఏ నుంచి విముక్తి కల్పించింది. దీంతో తాతానగర్ వాసులకు ప్రొసీడింగ్స్ కాపీలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందచేశారు. ఈ ప్రొసీడింగ్స్ త్వరగా రావడంలో పులుగోరు మురళీ, భరణి యాదవ్‌ల కృషి అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. రాజకీయ లబ్ధి కోసం మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నగరంలోని పలు ప్రాంతాలను 22ఏ కింద చేర్చారని, ఆ ప్రాంతాలన్నిటిని 22ఏ నుంచి విముక్తి కల్పిస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు. వైసీపీ కుట్రలను ప్రజలు లెక్క చేయకుండా నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో తనను గెలిపించిన ప్రజల సమస్యలు పరిష్కరించి వారి రుణం తీర్చుకుంటానని చెప్పారు. 22ఏ కింద చేర్చిన ప్రాంతాల ప్రజలు ఎన్డీఏ కూటమి నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవడంలో భాగస్వాములు కావాలని కోరారు. నివాస ప్రాంతాలను 22ఏ కింద చేర్చడమే కాకుండా రోడ్లు బ్లాక్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని ఆయన చెప్పారు. పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు, మంత్రి నారా లోకేష్‌లకు అండగా ప్రజలు నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, సూరా సుధాకర్ రెడ్డి, దొడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హేమంత్ కుమార్ యాదవ్, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, మహేష్ యాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో గోవధపై అధికారులు పేపర్ స్టేట్మెంట్లకే పరిమితం, చర్యలు శూన్యం





**చిలకలూరిపేట జూన్ 7 (జనస్వరం) :** గోవధ నివారణకు ప్రభుత్వాలు, అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. ముఖ్యంగా అధికారుల సమన్వయం లోపబూయిష్టం గాను ఉన్నదీ చిలకలూరిపేట నియోజకవర్గంలో గోవధ నిరాటంకంగా కొనసాగుతోంది. అధికారులు పేపర్ స్టేట్మెంట్లు ఇస్తున్నారు తప్ప, వాస్తవానికి చర్యలు శూన్యమని గోరక్షకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదు చేసినా పట్టించుకోని మున్సిపల్ కమిషనర్ :**
చిలకలూరిపేటలో గోవధపై అనేక ఫిర్యాదులు వస్తున్నా, మున్సిపల్ కమిషనర్ వాటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఫిర్యాదులు అందినా, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల గోవధకు పాల్పడుతున్న వారిలో భయం లేకుండా పోయిందని, ఇది మరింతగా రెచ్చిపోవడానికి దారితీస్తోందని బాధితులు చెబుతున్నారు. అధికారులు తమ బాధ్యతలను విస్మరించడం వల్ల పవిత్రమైన గోజాతికి అన్యాయం జరుగుతోందని పలువురు వాపోతున్నారు.

**కమిటీల ఏర్పాటుపై అస్పష్టత :**
గోవధకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, చిలకలూరిపేట నియోజకవర్గంలో ఈ కమిటీ ఏసారో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కమిటీలు ఏర్పాటు చేయకపోవడం లేదా ఏర్పాటు చేసినా వాటి పనితీరు అస్సలు లేకపోవడం వల్ల గోవధకు అడ్డుకట్ట వేసే వ్యవస్థ లేదని స్పష్టమవుతోంది. ఇది గమనిస్తే, నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆవేదనలో గోరక్షకులు, చిన్న దూడలనూ వదలని దురాగతాలు :**
గోవులను రక్షించడానికి ముందుకు వస్తున్న వారికి అధికారుల నుండి ఎటువంటి సహకారం లభించడం లేదు. "ఆవులను రక్షించేవారు లేరంటూ" బాధితులు కన్నీటిపర్యంతమవుతున్నారు. గోవధకు పాల్పడుతున్న వారు చిన్న దూడలను కూడా వదలడం లేదని, వాటిని కూడా దారుణంగా చంపుతున్నారని గోరక్షకులు ఆవేదన చెందుతున్నారు. పాలు ఇచ్చే గోవులను, చివరికి పసి దూడలను సైతం వధించకుండా అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**తక్షణ చర్యలు అవసరం :**
చిలకలూరిపేటలో గోవధను అరికట్టడానికి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులను పరిగణించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని గోరక్షకులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కమిటీలను ఏర్పాటు చేసి, వాటిని సమర్థవంతంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# ఘనంగా మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన పలువురు జర్నలిస్టులు**



**హైదరాబాద్, జూన్ 7 (జనస్వరం) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, ఏవీఎన్ టీవీ న్యూస్ ఛానల్ సీఈఓ, మహానది పత్రిక ఎడిటర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు శనివారం వనస్థలిపురంలోని ఏవీఎన్ టీవీ, మహానది పత్రిక కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో పలువురు ఏవీఎన్ టీవీ సిబ్బంది, మహానది పత్రిక రిపోర్టర్లు పాల్గొని మామిడి సోమయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, కోశాధికారి ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, ఫెడరేషన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ యర్రమిల్లి రామారావు, సీనియర్ జర్నలిస్టు జెనుగుర్తి ఉదయ్ భాస్కర్ రెడ్డి, ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా నాయకులు గోవింద రావు తదితరులు మామిడి సోమయ్యకు బొకే శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

# బోరిగాంలో బుద్ధ విగ్రహం పునః ప్రతిష్ఠించాలి

**విగ్రహ పరిరక్షణ కమిటీ నిరాహార దీక్ష కొనసాగింపు**




**భైంసా, జూన్ 7 (జనస్వరం) :** ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో తొలగించిన బుద్ధ విగ్రహాన్ని అదే స్థలంలో తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ బుద్ధ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భైంసా అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. శనివారం నాటికి దీక్ష 13వ రోజుకు చేరింది. భైంసా ఆర్డీఓ, ముధోల్ తహసీల్దార్ సంయుక్తంగా బుద్ధ విగ్రహాన్ని తొలగించారని ఆరోపించిన కమిటీ అధ్యక్షుడు హస్డే దేవదాస్, అదే స్థలంలో తిరిగి బుద్ధ విగ్రహం పునః ప్రతిష్ఠించేవరకు దీక్ష ఆపేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, సంబంధిత స్థలంలో రెండు ఎకరాల భూమిని బుద్ధ విగ్రహ నిర్మాణానికై కేటాయించాలని, అలాగే గతంలో దళిత మాల మహిళలపై జరిగిన దాడికి పాల్పడినవారిపై హత్యాయత్న కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక, దళిత మాల ప్రజలపై అక్రమంగా నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్లపై స్పష్టమైన చర్యలు తీసుకునే వరకు నిరాహార దీక్షను విరమించమని కమిటీ స్పష్టం చేసింది. ఈ దీక్ష కార్యక్రమంలో కమిటీ సలహాదారులు జంగ్మే గిరిధర్, జడే గంగాధర్, జనరల్ సెక్రటరీ హోట్టే రావ్ లక్ష్మణ్, ట్రెజరర్ దాసరి రాజారాం, బీఎస్ఐ పట్టణ కోశాధికారి ఉమ్డే గంగాధర్, రాష్ట్ర బీఎస్ఐ ఉపాధ్యక్షులు వాగ్మారే అబ్బారావ్, పర్యాటక శాఖ రాష్ట్ర బీఎస్ఐ ఉపాధ్యక్షులు ఆనంద్ రావు బోతే పాల్గొన్నారు. కుంసర, కుబీర్, బోరిగాం గ్రామాల మహిళలు కూడా భారీ సంఖ్యలో మద్దతు తెలిపారు. స్థానిక ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తక్షణమే బుద్ధ విగ్రహ ప్రతిష్ఠకు అనుమతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# ధ్వజారోహణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

**9 రోజులూ అప్పలాయ గుంటలో ఆధ్యాత్మిక శోభ**



**తిరుపతి, జూన్ 7 (జనస్వరం) :** టీటీడీకి అనుబంధంగా తిరుపతికి 20కి.మీల దూరంలోని అప్ప లాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుండి 8.00 గంటల మధ్య మిథున లగ్నంలో వైఖానసన ఆగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛా రణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు ఉదయం 5.30 నుండి 6.00 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా తన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామి వారు ఒకమారు ముందుగా పర్యవేక్షిస్తారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీ వారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రో క్తంగా గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ఎన్ని దానాలు చేసినా ధ్వజారోహణ కార్యంలో గరుడారోహణం వీక్షించిన భక్తులు పునీతులు అవుతారని పురాణాలు చెబుతున్నాయి. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుంది.

**టీటీడీ పటిష్ట ఏర్పాట్లు :**
బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున టీటీడీ పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తులకు అన్నదానం, ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణలు, పుష్పాలంకరణలు, క్షేత్ర మహిమను తెలిపేలా ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని టీటీడీ కోరుతోంది. ఉదయం 9.30 నుండి 11.00 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేపట్టారు. సాయంత్రం 5.30 నుండి రాత్రి 6.30 గంటల వరకు ఊంజల్‌సేవ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవ రాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ఏవీఎస్వో సతీష్ కుమార్ ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రహమత్ నగర్, ఎస్పిఆర్ హిల్స్ ఈద్గాలో నమాజ్ చేసిన ముస్లిం సోదరులు





**హైదరాబాద్, జూన్ 7 (జనస్వరం) :** బక్రీద్ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులు రహమత్ నగర్ డివిజన్‌లోని ఎస్‌పిఆర్ హిల్స్, క్రీడ మైదానంలో కార్పొరేటర్ సియ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఈద్గాలో పెద్ద ఎత్తున నమాజు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ప్రార్ధనలకు ఇస్లాం బోధకులు నక్ష బంధీ ముస్లిం సోదరులకు నమాజ్ చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధేయతకు, సోదరాభావానికి బక్రీద్ పండుగ నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇచ్చే సమయంలో అల్లాహ్ హు ఆజ్ఞను పాటించినందుకు ప్రేమ విధేయతకు నిలిచిందన్నారు. ప్రతి మానవ సోదరులందరూ సోదరా భావంతో కలిసి మెలిసి ఉండాలని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ నగర్, రెహమత్ నగర్, ఎస్పిఆర్ హిల్స్ కార్మిక నగర్ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు పాల్గొని ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో చేశారు.

# ముమ్మరంగా బడిబాట




**బొంరాస్‌పేట, జూన్ 7 (జనస్వరం) :** దుద్యాల మండలంలో రెండవ రోజు శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఆవాస ప్రాంతాల్లో ముమ్మరంగా కొనసాగింది. బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ విజయరామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించడం ద్వారా ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యతో పాటు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చందర్ నాయక్, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, మల్లప్ప, విజయ్ కుమార్, శ్రీనివాసులు, రాములు, రవి నాయక్, ముకుంద రెడ్డి, వెంకటయ్య, సంపత్, సాలిబాయి, సిఆర్పి రాందాస్ తదితరులు ఉన్నారు.

# ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ కావాలి




**పులివెందుల, జూన్ 7 (జనస్వరం) :** ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ వద్దు మాన్యువల్ కౌన్సిలింగ్ కావాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు స్థానిక పులివెందుల మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద శనివారం అధికారులు నిర్వహించ తలసిన వెబ్ కౌన్సిలింగ్ హెల్ప్ లైన్ సెంటర్ దగ్గర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పులివెందుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. వెబ్ కౌన్సిలింగ్‌లో ఉపాధ్యాయులు ఎక్కువ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి వస్తుంది. ఇందులో నష్టపోయేటువంటి అవకాశం ఉంది. కావున కచ్చితంగా ముందుగా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు మాట ఇచ్చిన విధంగా మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇందుకు ప్రభుత్వం స్పందించకపోతే డీఈఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం ఉంటుంది పులివెందుల రీజియన్ నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ మిత్రులు పాల్గొని ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా పులివెందుల డివిజన్ లోని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి

**- పాత భవనం కూలి గాయపడిన విద్యార్థులను పరామర్శించిన ఎన్ఆర్‌హెచ్‌సీ జిల్లా చైర్మన్ ముద్దమ్ విక్రమ్**





**భైంసా, జూన్ 7 (జనస్వరం) :** కుబీర్ మండలం అంతర్నీ గ్రామంలోని పాత పాఠశాల భవనం కూలి నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన ఘటనపై ప్రభుత్వం స్పందించాలని ఎన్ఆర్ హెచ్‌సీ నిర్మల్ జిల్లా చైర్మన్ ముద్దమ్ విక్రమ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, మెరుగైన వైద్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముద్దమ్ విక్రమ్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "పాత పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటాన్ని మానవత్వ హీనంగా నిర్లక్ష్యం చేశారు. కొత్త భవనం నిర్మించినప్పటికీ పాత భవనాన్ని కూల్చకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విద్యార్థులు భవనం ముందు ఆడుకుంటుంటారు, తల్లిదండ్రులు ఎన్నో సార్లు హెచ్చరించినా అధికారులు స్పందించలేదు," అని మండిపడ్డారు. గాయపడిన విద్యార్థులకు పూర్తిస్థాయి వైద్యం అందించాల్సిందిగా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కాశీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. చికిత్స ఖర్చులను ప్రభుత్వం భరించాలన్నది తమ డిమాండ్ అని తెలిపారు. "ప్రభుత్వం బాధ్యతగా స్పందించి మెరుగైన చికిత్స కల్పించే వరకూ ఎన్ఆర్‌హెచ్‌సీ జిల్లా టీం పోరాటం కొన సాగిస్తుంది," అని ముద్దమ్ విక్రమ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌హెచ్‌సీ నిర్మల్ జిల్లా కన్వీనర్ సరస్వతి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ముద్దు..ప్రైవేట్ పాఠశాల వద్దు

**బడిబాటలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు**





**బొంరాస్‌పేట, జూన్ 7 (జనస్వరం) :** ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శనివారం ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి మీ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుపడాలంటే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రైవేటు పాఠశాలలో వద్దని అవగాహన కల్పించారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేయన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య, అనిల్ కుమార్, నామ్య, నాయక్, లక్ష్మీకాంత్, గోపాల్ పిడి, నర్సింలు, స్రవంతి, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన నృత్య ప్రదర్శనలు




**పులివెందుల, జూన్ 7 (జనస్వరం) :** పట్టణ పరిధిలోని శిల్పారామంలో శనివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. బక్రీద్ పర్వదినం పురస్కరించుకొని పరిపాలనాధికారి విశ్వనాథ రెడ్డి పర్యవేక్షణలో స్థానిక చెన్నూరు దమ్ బిర్యాని సహకారంతో శ్రీ రాజా కళానిలయం డాన్స్ అకాడమీ చిన్నారులు నాట్య ప్రదర్శనలు చేశారు. సందర్భంగా మహాగణపతి మనసా సరామి, గాజులు తెచ్చియరో మామయ్య గాజులు తెచ్చియరో, నమో నమః నమశ్శివాయ, కళ్ళజోడు కాలేజీ పాప చూడు, జై బాలయ్య జై జై బాలయ్య, వన్నెలాడి టిక్కులాడి తిప్పుకోకే, జామ చెట్టు కాస్తాయి జామకాయలు వంటి పాటలకు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను రంజింపజేశాయి.

# ఫోక్ సింగర్ క్లైమెంట్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేతలు..



**శేరిలింగంపల్లి, జూన్ 7 (జనస్వరం) :** ప్రఖ్యాత గాయకుడు హైదరాబాద్ మాండలిక భాషలో సంగీత ప్రియులను తన గాన మాధుర్యంతో సుమారు మూడు దశాబ్దాలు పైగా సంగీత ప్రియులను ఉర్రూతలూగిస్తూ నేటికి ఫేమస్ ఫోక్ సింగర్‌గా విరాజిల్లుతున్న క్లైమెంట్ జన్మదిన సందర్భంగా మల్కాజ్‌గిరిలోని ఆయన నివాసం వద్ద అభిమానులు, సంగీత ప్రియుల, పురప్రముఖుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదినవేడుకలలో మియాపూర్ డివిజన్‌కి చెందిన బిజెపి అధ్యక్షులు. ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్, దొంతి శేఖర్ ముదిరాజ్, నరేశ్ చారిలు సింగర్ క్లైమెంట్‌కి శాలువతో సత్కరించి కేక్ కట్ చేయించి ఆయనకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ మాండలిక భాషలో సంగీత ప్రియులను ఆకట్టుకున్న ఫేమస్ ఫ్లోక్ సింగర్ క్లైమెంట్ నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని ఇంకా మరిన్ని పాటలు పాడుతూ సంగీత ప్రియులను అలరించాలని ఆకాంక్షించారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



**పులివెందుల, జూన్ 7 (జనస్వరం) :** నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా శనివారం వేంపల్లెలోని మదీనా పురం, బిస్మిల్లా మసీదు, ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు అందరూ కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక ప్రార్థనలకు ముందు బక్రీద్ పండుగ విశిష్టతను మత గురువులు ముస్లిం సోదరులకు తెలియజేశారు. దైవభక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందని మత గురువులు వ్యాఖ్యానించారు. అలాగే సమాజం కోసం త్యాగం చేయాలనే సందేశం బక్రీద్ పండుగ ఇస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్దకు ముస్లిం సోదరులు ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు ప్రార్థనలు చేసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సిఐ నర్సింహులు, ఎస్ఐ రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగ అందరి ఇళ్లలో సంతోషాలు నింపాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డిలు కోరారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



**చింతపల్లి, జూన్ 7 (జనస్వరం) :** పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, విషాదంలో మునిగిన ఓ కుటుంబానికి అండగా నిలిచారు. చింతపల్లి మండలం లోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని వాముగెడ్డ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన సత్యవతి కుటుంబాన్ని శనివారం ఆయన సందర్శించారు. సత్యవతి, పోలీస్ శాఖలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శెట్టి చిన్నయ్య పడాల్ కుమార్తె కాగా, ఇటీవల తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషాద వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ కుటుంబం గుండె పగిలే దుఃఖంలో ఉన్నప్పటికీ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ విషాద సమయంలో ఎమ్మెల్యే కుటుంబానికి అండగా నిలవడం స్థానికులలో మానవీయ స్పర్శగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంత్యక్రియల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మాజీ జడ్పిటీసీ సభ్యుడు మచ్చల మత్స్యరాజు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కంకిపాటి రామారావు, నాయకులు సుమర్ల సూరిబాబు, కరుణానిధి, గంగన్న దొర, చైతన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


## గాలి వానకు నేల కూలిన విద్యుత్తు స్తంభం



**చింతపల్లి, జూన్ 7 (జనస్వరం) :** శనివారం మధ్యాహ్నం చింతపల్లిలో కురిసిన గాలి వాన తీవ్ర ప్రభావం చూపింది. బలమైన ఈదురుగాలులకు సాయిబాబా ఆలయం సమీపంలోని జాతీయ రహదారి వద్ద విద్యుత్ స్తంభం కూలిపోయింది. స్తంభం రోడ్డుపై పడిపోవడంతో రహదారిపై వాహనాల రాకపోకలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరూ గాయపడకపోవడంతో ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. ఇదే సమయంలో మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను అదుపులోకి తీసుకురావడంతోపాటు, విద్యుత్ పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. విద్యుత్ శాఖ ప్రజలను శాంతంగా ఉండాలని కోరుతూ విద్యుత్ సేవలు త్వరితగతిన పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు.

## ఒకేరోజులో మూడు కాలాలు..

**- చింతపల్లిలో ఉదయం పొగ మంచు.. మధ్యాహ్నం ఎండలు..**
**మూడు గంటల సమయంలో ఉరుములతో వర్షం.**



**చింతపల్లి, జూన్ 7 (జనస్వరం) :** అల్లూరి జిల్లాలోని చింతపల్లి ఒక అరుదైన వాతావరణ అనుభూతికి వేదిక అయింది. ఒక్కరోజులోనే మూడు కాలాలను తలపించే వాతావరణం ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు మూడుసార్లు వాతావరణం తమ తీరును మార్చడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. ఉదయం సమయంలో చింతపల్లిలో మబ్బులతో కలసిన పొగ మంచు దట్టంగా కమ్ముకోవడంతో చలికాలంలా అనిపించింది. మారుమూల పల్లెలు కనబడకపోవడం, పొలాల్లో మంచు ముసిరిపోవడం కనిపించింది. అలాగే, మధ్యాహ్నానికి సూర్యుడు భగభగా మండిపోవడంతో ఉష్ణోగ్రతలు 40-42 డిగ్రీల దాకా ఎగిసిపోయాయి. ఈ తాపం కారణంగా ప్రజలు నీడలకే పరిమితమయ్యారు. వ్యవసాయ పనులు తాత్కాలికంగా ఆగిపోయాయి. అయితే సాయంకాలానికి మరోమారు వాతావరణం మారిపోయింది. ఆకాశంలో గాఢ మేఘాలు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వడగండ్ల వర్షం కూడా కనిపించిందని కొంతమంది రైతులు తెలిపారు. భూమి చల్లబడినప్పటికీ, ఈ హఠాత్ మార్పులు ప్రజల్లో కలవరం కలిగించాయి. పొద్దుపొయేలోపల మూడు వాతావరణాలు...! ఇది ప్రకృతి అద్భుతం లాంటి విషయమే.

# పోలవరం-బనకచర్ల మరో కాళేశ్వరం కానుంది : తులసిరెడ్డి



**పులివెందుల, జూన్ 7 (జనస్వరం) :** పోలవరం-బనకచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మరో కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో విఫల ప్రయోగంగా మారే ప్రమాదం ఉందని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ తులసిరెడ్డి తీవ్ర హెచ్చరిక చేశారు. పులివెందులలో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ ప్రాజెక్టు వెనుక కమీషన్ల లావాదేవీలే ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. తన వాస్తవిక వ్యాఖ్యలతో ప్రారంభించిన తులసిరెడ్డి, "అమ్మకు అన్నం పెట్టని వ్యక్తి పిన్నమ్మకు బంగారు గాజులు కొనిస్తాననట్టుగా" చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రవర్తిస్తోందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. శ్రీశైలం డ్యాం మరమ్మత్తులకు రూ.300 కోట్లు కేటాయించలేని ప్రభుత్వం రూ.81,900 కోట్ల భారీ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడాన్ని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ముందుగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, అన్నమయ్య, ఝురికోన వంటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలన్నారు. అవి పూర్తయితేనే రాష్ట్రం సస్యశ్యామలంగా మారే అవకాశం ఉందని తులసిరెడ్డి అభిప్రాయపడ్డారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు రూపకల్పనలో అనేక అవాస్తవాలు, ఆచరణలో అసాధ్యతలున్నాయని, 10 లిఫ్ట్‌లు, 3 భారీ టన్నెళ్లతో కూడిన ఈ ప్రాజెక్టు నిర్వహణకు అవసరమయ్యే 4000 మెగావాట్ల విద్యుత్తుతో పాటు 47,900 ఎకరాల భూమి అవసరం అవుతుందని తెలిపారు. ఇందులో 17,000 ఎకరాలు అటవీ భూమి కాగా, ఇప్పటివరకు పర్యావరణ, అటవీ, వన్యప్రాణి సంరక్షణ, జల సంఘాలు, నదీ యాజమాన్య బోర్డులు వంటి ఏ సంస్థ నుంచి కూడా అనుమతులు పొందలేదని పేర్కొన్నారు. ఇంకా మాట్లాడుతూ, "ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ఈ ప్రాజెక్టు శాశ్వతంగా అప్పుల కింద ముంచుతుందని" ఆయన హెచ్చరించారు. కేంద్రం, రాష్ట్రం, ప్రపంచ బ్యాంకులు, కాంట్రాక్టర్ల మధ్య ఖర్చు విభజనపై అవగాహన లేకుండానే టెండర్లు పిలవడంలో అసలు ఉద్దేశం ఏంటో ప్రజలు గుర్తించాలన్నారు. 50 శాతం నిధులు అంతర్జాతీయ సంస్థల అప్పుగా, 20 శాతం కాంట్రాక్టర్లు ముందుగా వెచ్చించి తర్వాత రైతుల నుంచి వసూలు చేసుకోవడం, మిగిలిన 30 శాతం కేంద్రం, రాష్ట్రం భరించాలనే విధానం ప్రజా వ్యతిరేకమన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశలో పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకూ, రెండో దశలో ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లపల్లి రిజర్వాయర్ వరకూ, మూడో దశలో బొల్లపల్లి నుంచి బనకచర్ల వరకూ చేపడతామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తులసిరెడ్డి ఖండించారు. ఏ శాఖల అనుమతులూ లేకుండా ముందస్తుగా టెండర్లు పిలవడం కేవలం కమీషన్ల కోసమేనని విమర్శించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు చరిత్రలో మరో "కాళేశ్వరం"గా మిగిలే ప్రమాదం ఉందని తులసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "అదనపు శ్రమలతో, నష్టాలతో, అప్పులతో రాష్ట్రాన్ని మళ్లీ కొందరి లాభాలకే ముంచితే ప్రజలు క్షమించరు" అని హెచ్చరించారు.

## మల్లన్న సేవలో.. కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి..



**శ్రీశైలం, జూన్ 7 (జనస్వరం) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేత్ దంపతులకు కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి సంజయ్ సేత్ దంపతులు శ్రీ స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనాది విశేష పూజలు నిర్వహించుకున్నారు. పూజల తదుపరి అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు వల్లించగా కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు శ్రీ స్వామి అమ్మవార్లకు చిత్రపటం, తీర్థ ప్రసాదాలను కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేతు దంపతులకు అందజేశారు.

## శ్రీరాంపురం ముఠా కాలువలో పూడికతీత పనులు ప్రారంభం

**చిరకాలం తర్వాత సాగునీటి సమస్యకు పరిష్కారం**



**పాయకరావుపేట, జూన్ 7 (జనస్వరం) :** చిరకాలంగా నిర్లక్ష్యం పాలైన శ్రీరాంపురం ముఠా కాలువ లో పూడికతీత పనులను ముఠా కాలువ ఛైర్మన్ చించలపు రామారావు శనివారం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో నీటి సంఘాలను రద్దు చేయడం వల్ల సాగునీటి కాలువల నిర్వహణ పూర్తిగా కుంటుపడింది. ఈ కారణంగా కాలువలో పూడిక పెరిగిపోయి, సాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన ఛైర్మన్ చించలపు రామారావు, నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ సహకారంతో కాలువ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. కాలువ మరమ్మతులకు ప్రభుత్వం రూ. 32 లక్షల గ్రాంటు విడుదల చేసింది. తుని నుంచి పాల్మన్‌పేట వరకు విస్తరించి ఉన్న ఈ ముఠా కాలువలో ప్రస్తుతం 22 గేట్లు తిరిగి ఏర్పాటు చేస్తున్నారు. ముఠా కాలువ పరిధిలో సుమారు 6000 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తుని, కవలపాడు, కొత్తూరు, పెదరాం భద్రపురం, శ్రీరాంపురం, ఎస్. నర్సాపురం, పాల్తేరు, అంకంపేట, కందిపూడి, రాజవరం, వెంకట నగరం, పాల్మన్‌పేట వంటి గ్రామాల రైతులు ఈ కాలువ నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. సుమారు 3000 మంది రైతులకు ఈ కాలువ జీవనాధారంగా ఉంది. పూడికతీత పనుల ప్రారంభం వల్ల రాబోయే సాగు కాలానికి నీటి సరఫరా మెరుగవుతుందని, రైతుల ఆందోళనకు ముగింపు లభిస్తుందని ఛైర్మన్ రామారావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్ (పద్దు), ఇరిగేషన్ శాఖ ఏఈ సురేష్ కుమార్, చించలపు రాంబాబు, రాజుబాబు, ముఠా కాలువ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన చంద్రన్న పల్లెపండుగ

**- 18 గ్రామాలలో 11 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు**
**- వాడవాడలా అభివృద్ధి పనులు**
**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**నెల్లూరు, జూన్ 7 (జనస్వరం) :** రూరల్ పరిధిలోని దొంతాలి, ఉప్పుటూరు, సౌత్ మోపూరు, ఆమంచర్ల గ్రామాలలో శనివారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్థానిక ప్రజలతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. అయితే నేటి కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చాక నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతుందని తెలియజేశారు. అన్నిరకాలుగా ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు నడిపిస్తూ, మనకోసం కష్టం చేస్తున్న సీఎం చంద్రబాబుకి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇంకా పది సంవత్సరాలు పాలనలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## చటాకాయ్ సర్పంచ్ ఘంటసాల శేషారావు మృతి



**కైకలూరు, జూన్ 7 (జనస్వరం) :** మండలంలోని చటాకాయ గ్రామ సర్పంచ్ ఘంటసాల శేషారావు శనివారం ఆకస్మిక మృతి చెందారు. సర్పంచ్ శేషారావు మృతితో మండల ప్రజలు, గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా చేసి గ్రామాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. సర్పంచ్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే యేసు రాజు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

## అంతర్జాతీయ వైద్య సదస్సులో నంద్యాల వైద్యుడికి ప్రశంసలు



**నంద్యాల, జూన్ 7 (జనస్వరం) :** ఇటీవల బెంగళూరులో జరిగిన ఏడవ అంతర్జాతీయ ప్రత్యక్ష శస్త్ర చికిత్సల సదస్సులో నంద్యాలకి చెందిన చెవి-ముక్కు-గొంతు శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ చిత్తలూరి మణిదీప్ సమన్వయకర్తగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు. "రివిజన్ కొలీస్టీయటోమా" అంశంపై నిర్వహించిన ప్రత్యేక సెషన్‌కి జాతీయ స్థాయి నిపుణులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సింగరి ప్రభాకర్, డాక్టర్ పలనియప్పన్‌లతో కలిసి చర్చలను సమన్వయం చేశారు. ఈ సందర్భంగా జాతీయ చెవి ముక్కు గొంతు వైద్య నిపుణుల సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయేంద్ర, డాక్టర్ మణిదీప్‌ను ప్రశంసిస్తూ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. డాక్టర్ మణిదీప్ ఈ ఘనత సాధించిన సందర్భంగా ఆయనకు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర రెడ్డి, నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనారావు, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ మధుసూదన్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## స్త్రీలను గౌరవించే రాష్ట్రంలో మహిళా ద్వేషికి స్థానం లేదు

**మాజీ మంత్రి ప్రత్తిపాటి**



**చిలకలూరిపేట, జూన్ 7 (జనస్వరం) :** సాక్షి టీవీపై ప్రసారమైన అభాసుపాల వ్యాఖ్యలకు తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, "స్త్రీలను గౌరవించే భరతదేశంలో జగన్ లాంటి మహిళా ద్వేషికి స్థానం లేదు" అని ధ్వజమెత్తారు. రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాక్షి ఛానల్ సిబ్బందికి, దాని వెనుక ఉన్న జగన్‌కు రాష్ట్రంలోని మహిళలు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌కు మహిళల పట్ల గౌరవం ఎప్పటికీ లేదని, కన్న తల్లి, సొంత చెల్లినే గౌరవించని వ్యక్తి ఇతర మహిళలను గౌరవిస్తాడని ఊహించడం దురాశేనని విమర్శించారు. "అవినీతి సొమ్ముతో నడిచే మీడియా ద్వారా తాను అన్నీ చేయగలనని భావించే జగన్‌కు ఇది గుణపాఠం కావాలి. మహిళలపై చేసిన అనాదరణ వ్యాఖ్యలకు ముమ్మాటికీ జగన్ బాధ్యత వహించాలి. ఆయన తక్షణమే రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. రాజధాని మహిళలకు బేషరతుగా క్షమాపణలు కోరాలి" అని డిమాండ్ చేశారు. "సాక్షి ఛానల్‌ను, దాని పత్రికను తగిన విచారణకు లోనుచేసి, మీడియా స్వేచ్ఛ పేరుతో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు. వ్యక్తిగత లాభాల కోసమే విలువలకు తిలోదకాలిచ్చే అవినీతి మీడియాను ప్రజలు తిరస్కరించాలని హితవు పలికారు.

**పల్లా సింహాచలం మృతిపై సంతాపం :**
టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం మృతి పట్ల మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. పల్లా కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. సింహాచలం 1989 నుంచి టీడీపీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనగా, 1994లో విశాఖపట్నం-2 నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. వారు అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం ఎంతో బాధాకరమని తెలిపారు.

## ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ఆర్థిక సహాయం

**- కావూరు గ్రామానికి చెందిన విద్యార్థికి రూ. లక్ష ఆర్థిక సాయం చేసిన గివింగ్ బ్యాక్ టూ సొసైటీ**
**- చిలకలూరిపేటలో తహసీల్దార్ చేతుల మీదుగా విద్యార్థికి చెక్కు అందజేత**




**చిలకలూరిపేట, జూన్ 7 (జనస్వరం) :** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పల్లపు శ్రీహర్షకు గివింగ్ బ్యాక్ టూ సొసైటీ రూ.లక్ష ఆర్థిక సహాయం చేసింది. మండలంలోని కావూరి గ్రామానికి చెందిన పల్లపు శ్రీహర్ష విజయవాడలోని శ్రీచైతన్య స్కూలులో చదివి ఇంటర్మీడియట్ ఫలితాలలో 1000 మార్కులకు గాను 921 మార్కులు సాధించాడు. ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు శ్రీహర్షను అభినందిస్తూ తదుపరి ఇంజనీరింగ్ విద్య కోసం గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రోత్సాహకంగా రూ.1,00,000 నగదు బహుమతిని అందజేసింది. శనివారం చిలకలూరిపేట తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ చేతుల మీదుగా సదరు చెక్కును విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ సామాజిక సేవ దృక్పథంతో గివింగ్ బ్యాక్ టూ సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని చెప్పారు. విద్యా, వైద్య పరంగా ప్రజలకు ఉపయోగపడే పనులు గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తుండడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని సమాజ సేవకు కేటాయించాలని కోరారు. సేవ చేయడంలో ఎంతో ఆనందం ఉంటుందని సూచించారు. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులు తమ ఉన్నత విద్యను మంచి లక్ష్యంతో, క్రమశిక్షణతో పూర్తి చేసి కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా, చేయూతగా నిలవాలని కోరారు.